దుండిగల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన శంకరయ్య

దుండిగల్,జనవరి10: దుండిగల్ పోలీస్‌స్టేషన్ సీఐగా సీహెచ్ శంకరయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సైబరాబాద్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో జరిగిన పోలీసుల బదిలీల్లో భాగంగా ఇక్కడ సీఐగా పనిచేసిన వై.రామకృష్ణ శంషాబాద్ సీసీఎస్‌కు బదిలీకాగా, మేడ్చల్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సీహెచ్.శంకరయ్యను దుండిగల్ సీఐగా నియమించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

దుండిగల్, జనవరి10: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన సంక్షేమసంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు బుధవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద శంభీపూర్‌కృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సు సర్వీసులు

మియాపూర్,జనవరి 10: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆర్‌టీసీ మియాపూర్ డిపో నుంచి దూర ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు మియాపూర్ డిపో అధికారులు బుధవారం తెలిపారు. మియాపూర్ కూడలి నుంచి అమలాపురం, కాకినాడ, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్టణానికి ఈ బస్ సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధితోనే దేశపురోగతి



మహిళలకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

జగద్గిరిగుట్ట, జనవరి10: మహిళలు స్వయం సంవృద్ధిసాధించడంతోనే దేశం పురోగతి సాధిస్తుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవిహిల్స్‌లో బుధవారం ఆయన పర్యటించారు. రాష్ట్ర మహిళాసహకార అభివృద్ధి సంస్థ, మహిళా శిశువికాసకేంద్రం సంయుక్తాధ్వర్యంలో జరిగిన శిక్షణ ముగింపు వేడుకల్లో ఆయన అతిథిగా పాల్గొన్నారు. టైలరింగ్, బ్యూటీషియన్ సర్టిఫికెట్లను పలువురు మహిళలకు ఆయన అందజేశారు. స్వయం ఉపాధికోసం శిక్షణ తీసుకోవడం అభినందనీయమన్నారు. మహిళలకు చేయూతనిచ్చేందుకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. బ్యాటరీతో నడిచే ఆటోను మహిళ నడపగా కార్పొరేటర్ జగన్‌తో కలసి కొంతదూరం ప్రయాణించారు. కాలుష్య రహిత వాహనాల వినియోగం పెరగాలని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు డివిజన్‌కు ఎమ్మెల్యే రాకసందర్భంగా ఘనంగా స్వాగతం పలకగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి నివాళుర్పించి పాదయాత్ర చేశారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ సాధించిన ఆయనను పలువురు నేతలు కార్పొరేటర్ జగన్ నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. రుద్రఅశోక్, కృష్ణగౌడ్, వేణుయాదవ్, జైహింద్, సయ్యద్‌రషీద్, సంఘాలు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన ప్రజలు..

దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమసంఘాల ప్రతినిధులు, మహిళలు, బీఆర్ఎస్ పార్టీ నేతలు, బుధవారం ఎమ్మెల్యే వివేకానంద్‌ను పేట్‌బషీరాబాద్‌లోని ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.

క్యాలెండర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్‌వీ కో-ఆర్డినేటర్ శ్రీకాంత్ రూపొందించిన నూతన సంవత్సరం(2024) క్యాలెండర్‌ను బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ తన క్యాంపు కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్‌వీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

మియాపూర్, జనవరి 10: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎంపీ రంజిత్‌రెడ్డికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎంపీ రంజిత్‌రెడ్డి ఎమ్మెల్యే గాంధీ నివాసానికి విచ్చేశారు. అనంతరం కార్పొరేటర్లు నార్నె శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ రంగారావు, రామారావుతో కలిసి ఎమ్మెల్యే గాంధీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు సంజీవరెడ్డి, ఇబ్రహీం, రాము, షకీర్ పాల్గొన్నారు.

'టీమ్ రంజిత్ అన్న' క్యాలెండర్ ఆవిష్కరణ..

మాదాపూర్, జనవరి 10: టీమ్ రంజిత్ అన్న యూత్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన నివాసంలో బుధవారం ఎంపీ రంజిత్‌రెడ్డి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీమ్ గడ్డం రంజిత్‌రెడ్డి అధ్యక్షుడు జహీరుద్దీన్, హబిబ్ భాయ్, అఫ్రోజ్, టీఆర్ఎస్ నాయకులు దారుపల్లి అనీల్, నిఖిల్, నాగరాజు తదితరులు ఉన్నారు.

షిర్డీ సాయిబాబా దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు

మహారాష్ట్రలోని శిర్డీ సాయిబాబా దేవాలయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం శిర్డీ సాయినాథుడిని దర్శించుకుని పూజలు చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రజలు సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నేతలు శ్యామలరాజు, గోనె శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 10

పారిశుద్ధ్యం మరింత మెరుగు పడాలి

జడ్సీ స్నేహ శబరీష్
చందానగర్ సర్కిల్‌లో పర్యటన

పారిశుద్ధ్య పరిస్థితులపై అధికారులతో మాట్లాడుతున్న జడ్సీ స్నేహ శబరీష్

మియాపూర్, జనవరి 10: పారిశుద్ధ్య నిర్వహణ మరింతగా మెరుగుపడాలని ఆ విభాగం పనితీరు అత్యంత కీలకమని శేరిలింగంపల్లి జడ్సీ స్నేహ శబరీష్ పేర్కొన్నారు. సంబంధిత విభాగం అధికారులు, సిబ్బంది సకాలంలో క్షేత్రస్థాయిలో విధులకు హాజరుకావాలన్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలోని మియాపూర్ డివిజన్ జేపీనగర్‌లో పారిశుద్ధ్య నిర్వహణ పరిస్థితులను డీసీ వంశీకృష్ణ, ఇతర అధికారులతో కలిసి జడ్సీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి చెత్త సేకరణకు ప్రయివేటు ఆటోలు రాకపోవటాన్ని జడ్సీ గుర్తించి వైద్యాధికారిని ప్రశ్నించారు. ఆటోలు ఎందుకు రావటం లేదని ఇలాగైతే ఇండ్ల నుంచి చెత్త సేకరణ ఎలా సాధ్యమన్నారు. స్వచ్ఛ ఆటోలతో పాటు ప్రయివేటు ఆటోలు సేకరణకు రావాల్సిందేనని జడ్సీ స్పష్టం చేశారు. రహదాలపై చెత్త కుప్పలు కన్పించవద్దని, ఎప్పటికప్పుడు డంప్ యార్డుకు తరలించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాల సేకరణ యార్డ్‌కు తరలించే ప్రక్రియ ఎలా సాగుతున్నదని వాహనాల లభ్యత సమయాలపై జడ్సీ ఆరా తీశారు. అనధికారికంగా నిర్మాణ వ్యర్థాలను రహదారులపై పడేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో సర్కిల్ వైద్యాధికారి డాక్టర్ కార్తీక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం(జిల్లా తెలంగాణ భవన్)లో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అదే విధంగా హెచ్ఎంటీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ డైరీని ప్రారంభించారు.

– దుండిగల్,జనవరి10

అలరించిన నృత్య ప్రదర్శనలు

మాదాపూర్, జనవరి 10: సంక్రాంతి పండగను పురస్కరించుకొని మాదాపూర్‌లోని శిల్పారామంలో గాంధీ శిల్పా బజార్ పేరిట ఏర్పాటు చేసిన హస్తకళా ఉత్పత్తులు నగర వాసులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అక్షయ ఫౌండేషన్, డాక్టర్ శౌరి, స్పందన చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ నామాని రవి కుమార్, నాట్యా చార్య రంజిత్ కుమార్‌లు విచ్చేసి బుధవారం జ్యోతి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.

ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన



మాదాపూర్, జనవరి 10: సందేశాత్మక చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించిన స్పెక్ట్రమ్ ఆర్టిస్ట్ సర్కిల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, ఐఏఎస్, డాక్టర్ లక్ష్మీ విచ్చేసి కళాకారులతో కలిసి సందర్శించడం జరిగింది. కళాకారులు వేసిన కళాకృతులు సందేశాత్మకంగా ఉన్నాయని, చూపరులను ఇట్టే ఆకర్శించేలా ఉన్నాయని ఐఏఎస్ లక్ష్మీ కొనియాడారు. కలకత్తాకు చెందిన 9 మంది ఆర్టిస్ట్‌లు పలు చిత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో చిత్ర కళాకారులు తదితరులు ఉన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ

అల్లాపూర్, జనవరి10: అయోధ్య రాముని అక్షింతల పంపిణీ కార్యక్రమం వాడవాడలా ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నది. బుధవారం అవంతినగర్ తోట సంక్షేమ సంఘం అధ్యక్షుడు అన్నెం కోటి ఆధ్వర్యంలో ఇంటింటికీ అయోధ్యరాముని అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీరబాబు, టి.దేవేందర్‌రావు, శ్రీమతి వీణ కుమారి, సత్యనాదం ఏలెండర్‌రెడ్డి, సుశీల్ కుమార్, శివ కుమార్, బి.శ్రీనివాస్ రెడ్డి, సుబ్బారావు, రాజు, హరీశ్ పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీకాలనీలో..

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 10 : అయోధ్య శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్రం ట్రస్ట్ ఆదేశాల మేరకు కేపీహెచ్‌బీ కాలనీ వేంకటేశ్వర బస్తీ ఆధ్వర్యంలో గడపగడపకు అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ రైతు మృతి

దుండిగల్,జనవరి10: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ రైతు వైద్యశాలలో చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లాలోని వావిలాల గ్రామానికి చెందిన మంగలి కృష్ణ(65) అనే వ్యక్తి దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, డీ.పోచంపల్లిలోని రాజరాజేశ్వర కాలనీలో కుటుంబంతో ఉంటూ సొంతగ్రామంలో ఉన్న వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తనబైక్ పై వస్తుండగా ఉజ్వల బార్ సమీపంలో టాటాఏస్ వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో అతడికి తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

గుర్తుతెలియని వృద్ధుడు..

బాలానగర్, జనవరి 10 : అపస్మారక స్థితిలో పడిఉన్న గుర్తు తెలియని (వృద్ధుడు) బిక్షాటన చేసే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన బాలానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫిరోజ్‌గూడ, గౌతంనగర్ ప్రాంతాలలో 70-75 ఏండ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి బిక్షాటన చేస్తూ గుడి వద్ద పడుకునే వాడు. డిసెంబర్ 29న పాత విమానశ్రయం రోడ్డులో ఫిట్స్ వచ్చి అపస్మారకస్థితిలో పడి ఉండగా బాలానగర్ పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

చికిత్స పొందుతూ..

మాదాపూర్, జనవరి 10: బీహార్‌కు చెందిన మోఫిజ్ (50) హైదారాబాద్‌కు వలసవచ్చి చందానగర్‌లోని పాపిరెడ్డి కాలనీలో నివాసం ఉంటు కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 9వ తేదీన సాయంత్రం 5:30 గంటలకు కాండియర్ లేబర్ అడ్డా వద్ద ఉన్నటువంటి వాటర్ ట్యాంక్ వద్దకు పని ముగించుకొని స్నానం చేసేందుకు వెళ్లాడు. అక్కడ స్పృహతప్పి పడిపోయాడు. అతడిని దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

కారును ఢీకొట్టిన లారీ

మూసాపేట, జనవరి10: జాతీయ రహదారిపై కారును లారి ఢీ కొట్టిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి నుంచి వై జంక్షన్ వైపు వెలుతున్న కారును వెనుక వైపు నుంచి వచ్చిన లారి మోట్రో ఫిల్లర్ 832 వద్ద ఢీ కొట్టడంతో కారు నుజ్జునుజ్జు అయింది. ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు.

బాలికపై అత్యాచార యత్నం

జీడిమెట్ల, జనవరి 10 : గుర్తు తెలియని వ్యక్తి ఓ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీడిమెట్ల ఎస్ఐ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. కల్పనా సొసైటీలో నివాసం ఉండే మైనర్ బాలిక (13) మంగళవారం రాత్రి ఇంటి ముందు సైకిల్‌పై వెళ్తున్నది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి సదరు బాలికను లాక్కెళ్లి అక్కడే ఉన్న డెకరేషన్ షెడ్‌లో అత్యాచారానికి యత్నించాడు.

బాలిక అరుపులు, కేకలతో సదరు వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. జరిగిన విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో బుధవారం రాత్రి జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డ్రైవర్లకు నష్టం తెచ్చే.. ఆ చట్టం వద్దు: సీఐటీయూ

బాలానగర్, జనవరి 10 : డ్రైవర్లకు నష్టం తెచ్చే భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) 104(2) చట్టంను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్ ధర్నా నిర్వహించారు. బుధవారం ఐడీపీఎల్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లతో కలిసి రాజశేఖర్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ నాయకులు బి.ఉమేశ్‌రెడ్డి డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు విష్ణు, మోసిన్, శేఖర్, నరేశ్, సత్యం, భాస్కర్, ముఖేశ్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ఆచార్య గోనానాయక్‌కు సన్మానం

శేరిలింగంపల్లి, జనవరి 10: సెంట్రల్ యూనివర్సిటీలో తెలుగు శాఖ అధ్యాపకులుగా పని చేస్తున్న అచార్య ఎం.గోనానాయక్‌ను ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషా సంఘం, భాషాభివృద్ధి ప్రాధికారి సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల తెలుగు భాషా సేవ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న ఆయనను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య పిల్లలమర్రి రాములు, పవన్‌కుమార్, విజయలక్ష్మీలతో పాటు పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

దేవి (ఫైల్)

జీడిమెట్ల, జనవరి 10: మతిస్థిమితం సరిగాలేని మహిళ అదృశ్యమైన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ గంపల బస్తీకి చెందిన దేవి (35)కు కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి పట్టునే ఉంటోంది. ఈ నెల 1వ తేదిన ఇంట్లో ఎవరూలేని సమయంలో దేవి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.

సూరారం కాలనీలో వృద్ధురాలు..

భాగ్య(ఫైల్)

దుండిగల్,జనవరి10: ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ వృద్ధురాలు తిరిగిరాలేదు. ఈ సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుభాశ్‌నగర్ డివిజన్ పరిధి, సూరారం కాలనీలోని కృషికాలనీకి చెందిన రాచకొండ చంద్రమౌళి భార్య భాగ్య(60) మతిస్థిమితంతో బాధపడుతున్నది. ఈ ఈనెల 9వ తేదీన ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన భాగ్య తిరిగి ఇంటికి చేరుకోలేదు. భాగ్య కొడుకు మల్లేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓబీసీ కులగణన చేపట్టాలని

సత్యాగ్రహ దీక్ష

శేరిలింగంపల్లి, జనవరి 10: వెంటనే ఓబీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఓబీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ మెయిన్‌గేట్ వద్ద ఒక రోజు సత్యాగ్రహ దీక్ష కార్యక్రమం నిర్వహించారు. కుల గణన వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందని పేర్కొంటూ బుధవారం ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమానికి హాజరై మద్దతు తెలిపిన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్ ఈ.వెంకటేశ్, విద్యార్థి సంఘం నాయకులు కొండల్, సాయికిరణ్, మురళి, ముక్తిలక్ష్మి, నర్సయ్య, మల్లేశ్, మధన్‌మోహన్ పాల్గొన్నారు.

ప్రతి కాలనీలో అన్ని వసతులు కల్పిస్తా..

ఎమ్మెల్యే అరెకపూడిగాంధీ



రాం నరేశ్‌నగర్‌లో ఓ మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, చిత్రంలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

మియాపూర్, జనవరి 10 : సమస్యల్లేని కాలనీలతో పాటు పూర్తిస్థాయి మౌలిక వసతులతో కాలనీలన్నింటినీ పురోగతి వైపు నడిపిస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. డ్రైనేజీ, రహదారులు, తాగునీరు వంటి సౌకర్యాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాం నరేశ్‌నగర్‌లో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావుతో కలిసి ఎమ్మెల్యే గాంధీ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. నాలాలు డ్రైనేజీలలో వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, మురుగు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదనపు నిధులను మంజూరు చేయించి కాలనీలో నూతన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజీవ్, రంగారావు, అధికారులు, పార్టీ నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు

మాదాపూర్, జనవరి 10: : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆర్‌టీసీ కాలనీలో శ్రీ సీతారామాంజనేయ ఆలయంలో నిర్వహించిన మండల పూజా కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు.

ఎంతటివారైనా బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 10 : భారతీయ జనతా పార్టీ విలువలతో కూడిన పార్టీయని.. పార్టీలో ఎంతటివారైనా సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయాల్సి ఉంటుందని కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీశ్‌రెడ్డి మంగళవారం కూకట్‌పల్లిలో బీజేపీ నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశాన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తూ ఓ ప్రకటనలో తెలిపారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు అభినందనీయం

బాలానగర్, జనవరి 10 : ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి అన్నారు బుధవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధి హస్మత్‌పేట అంజయ్యనగర్‌లో వీఆర్ వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్ హాజరై ప్రారంభించారు.

రేపు గాంధీనగర్‌లో రక్తదాన శిబిరం

జగద్గిరిగుట్ట, జనవరి10: రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం రక్తదానశిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు వివేకానంద యువజనసంఘం అధ్యక్షుడు జల్దాలక్ష్మీనాథ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కీళ్ల, హార్ట్, డెంటల్, షుగర్‌వ్యాధులకు ఉచితవైద్యశిబిరం ఉంటుందన్నారు. జీడిమెట్ల లయన్స్‌క్లబ్, మల్లారెడ్డి హాస్పిటల్ సహకారం అందిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1వరకు జరిగే కార్యక్రమంలో రక్తదాతలు పాల్గొనాలని కోరారు.

286 ఎకరాల భూమి భాగ్యనగర్ సొసైటీదే

అల్లాపూర్,జనవరి10;కూకట్‌పల్లి మండలం సర్వేనెంబర్ 1007 లో గల 286 ఎకరాల భూమి భాగ్యనగర్ సొసైటీ లో ఉన్న 1400 మందికి చెందినదని భ్యాగనగర్ కోఆపరేటీవ్ సొసైటీ అధ్యక్షుడు రాజా ఉమారెడ్డి స్పష్ట చేశారు. సర్వేనంబర్ 1007లో ఉన్న 286 ఎకరాల భూమిని వేలం వేయాలని సీపీఐ నేత ఈటి నర్సింహ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం సొసైటీ సభ్యులతో కలిసి ఉమారెడ్డి విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు.

20 వేల దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి

చందానగర్ సర్కిల్‌లో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ముమ్మరంగా చేపడుతున్నట్లు డీసీ వంశీకృష్ణ పేర్కొన్నారు. 130కి పైగా ఆపరేటర్ల ద్వారా రెండు షిఫ్టులలో ఆన్‌లైన్ నమోదును చేపడుతున్నామన్నారు. ఇక్కడి సర్కిల్ కార్యాలయ ఆవరణలోని అంబేద్కర్ కల్యాణ మంటపంలో దరఖాస్తుల ఆన్‌లైన్‌ను డీసీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీ వంశీకృష్ణ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో 36వేలకు పైగా దరఖాస్తులకు గాను ఇప్పటికే 20 వేల వరకు పూర్తయినట్లు, తగినంత ఆపరేటర్లు అందుబాటులో ఉన్న నేపథ్యంలో గురువారం సాయంత్రం ఆన్‌లైన్ నమోదును పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. సర్కిల్ పరిధిలో రెండు వేర్వేరు ప్రాంతాలలో ఈ ప్రక్రియను చేపడుతున్నామని, ఆపరేటర్లకు తగు సదుపాయాలు కల్పిస్తున్నట్లు డీసీ వంశీకృష్ణ తెలిపారు.

- మియాపూర్, జనవరి 10

ఈర్ల చెరువును కబ్జా నుంచి కాపాడండి

మాదాపూర్, జనవరి 10: మదీనగూడ ఈర్ల చెరువును కబ్జా నుంచి కాపాడాలని జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. మదీనగూడలోని ఈర్ల చెరువు కొంతమంది కబ్జా చేశారని, కబ్జా నుంచి కాపాడాలంటూ జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి బుధవారం రాజేంద్రనగర్ ఆర్‌డీఓకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం రంగారెడ్డి జోనల్ కమిషనర్, కలెక్టర్, శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్, చందానగర్ ఇరిగేషన్ గంగా పావనిలకు కబ్జాకు సంబంధించిన ఫొటోలను పంపినట్లు ఆయన తెలిపారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

దుండిగల్,జనవరి10: సంక్రాంతి పండుగకు తమ సొంత ఊరు వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఏసీపీ పి.శివభాస్కర్ అన్నారు. బధవారం బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాచుపల్లి సీఐ ఉపేందర్‌తో కలిసి సంక్రాంతి పండుగ వేళ దొంగతనాలు నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముందస్తుగా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు రమేశ్, యాదగిరి, సంధ్య, మహేశ్ పాల్గొన్నారు.

**